క్లుప్తంగా

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



సిరికొండ: మండల కేంద్రం నుంచి కామారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గత నెలలో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన ఆర్అండ్బీ అధికారులు ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయించారు. మండల కేంద్రానికి సమీపంలో ఒక చోట ఏర్పడ్డ భారీ గుంతలకు అటు వైపు, ఇటు వైపు మరమ్మతులు చేపట్టారు. కానీ రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలను మాత్రం పూడ్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలకు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పంటల ప్రణాళిక ప్రకటించాలి



ఖలీల్వాడి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వానాకాలం పంటల ప్రణాళికను ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం (ఎన్ఆర్ భవన్)లో శుక్రవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భూమయ్య మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్లో రైతులకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట, జీలుగాను ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేయాలన్నారు. వానలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. అన్ని రకాల వడ్లకు ఇతర పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. స్వామినాథన్ సూచించిన విధంగా పంటల పెట్టుబడిలో 50 శాతం కలిపి (సీ2+50శాతం) ధరలు ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, తడకల కృష్ణగౌడ్, అగ్గు చిన్నయ్య, దేవస్వామి, బస్సీ, గుండ్ల నాగేష్ పాల్గొన్నారు.

శబరిమలకు అర్బన్ ఎమ్మెల్యే



సుభాష్నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ శుక్రవారం శబరిమల తరలివెళ్లారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారి ఆలయానికి వెళ్లి, అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ధన్పాల్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంచాల శంకరయ్యగుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

ట్రాన్స్కో అధికారులకు అవార్డులు

నవీపేట: ఉత్తమ సేవలందించినందుకు నవీపేట ఏడీఈ సుహాసిని, ఏఈ ప్రవీణ్కుమార్కు శుక్రవారం అవార్డులు వరించాయి. ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ట్రాన్స్కోలో ఉత్తమ సేవలపై ఆరాతీశారు. నవీపేట ఏడీఈ సుహాసినికి ద్వితీయ స్థానం లభించగా, గ్రామీణ సెక్షన్ విభాగం ఏఈ ప్రవీణ్కుమార్కు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. అవార్డులు పొందిన ఉద్యోగులను నిజామాబాద్ డీఈఈ శ్రీనివాస్ అభినందించారు.

కొయ్యలకు నిప్పు పెట్టొద్దు

మోర్తాడ్: యాసంగిలో వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఏర్గట్ల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ శుక్రవారం వెల్లడించారు. వరి కోతల తర్వాత మిగిలిన కొయ్యలను కాల్చి బూడిద చేస్తే ప్రయోజనం ఉండదని తెలిపారు. పొలంలో వరి కొయ్యలకు నిప్పు పెడితే భూమి విపరీతంగా వేడెక్కుతుందని ఫలితంగా భూసారం కోల్పోతుందని పేర్కొన్నారు. పంటలకు మేలు చేసే పురుగులు సైతం మరణిస్తాయన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

పెర్కిట్: లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెర్కిట్ 7వ వార్డు పరిధిలోని తిరుమల కాలనీవాసులు ట్రాన్స్కో ఏఈ భాస్కర్ ప్రసాద్కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. కాలనీలో సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్ త్రీ ఫేస్గా మారిస్తే సమస్య తీరుతుందని అన్నారు. ఏడీకి ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- నగరంలో చిన్నవానకే చిత్తడవుతున్న రహదారులు
- ఇబ్బందుల్లో నగరవాసులు





నగరంలోని గాయత్రినగర్లో మట్టిరోడ్లపై నిలిచిన నీరు

నిజామాబాద్ నాగారం: నగరంలోని పలు డివిజన్లలోగల అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే రహదారులు చిత్తడిగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గాయత్రినగర్లో మట్టిరోడ్లే..

జిల్లా కేంద్రంలోని 24వ డివిజన్లోగల గాయత్రి నగర్ గల్లీలో పూర్తిగా మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. కాలనీలో 25 సంవత్సరాలుగా మట్టిరోడ్లు అలాగే ఉన్నాయని, అభివృద్ధి చేయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కార్పొరేటర్, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామన్నారు. గత రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి ద్విచక్ర వాహనదారులు బురదమయమైన రోడ్లపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాలు పనిచేసిన స్థానిక కార్పొరేటర్ నిధులు మంజూరు అయినప్పటికీ రోడ్లు వేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీకి పన్నులు చెల్లించినప్పటికీ ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో రోడ్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లను బాగు చేయించాలి..



ప్రభుత్వం ఇంటి పన్నులను వసూలు చేస్తుంది. కానీ కాలనీవాసులకు కావల్సిన కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కాలనీలో రోడ్లను బాగుచేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి. –దేవేందర్, గాయత్రినగర్

నేటి చిత్రం..

డ్రెయినేజీని శుభ్రం చేయరు



మురుగునీటితో నిండిపోయిన డ్రెయినేజీ

నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోగల పోస్టాఫీస్ వద్ద డ్రెయినేజీ మురుగునీటితో పూర్తిగా నిండిపోయింది. వ్యర్థాలు పేరుకుపోవడంతో నీటి పారకం నిలిచిపోయింది. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీనీ శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిజాయితీపరులనే తెయూ వీసీగా నియమించాలి



మాట్లాడుతున్న పీడీఎస్యూ నాయకులు

తెయూ(డిచ్పల్లి): తెలంగాణ యూనివర్సిటీ నూతన వీసీగా నిజాయితీ గల వారిని నియమించాలని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెయూ క్యాంపస్ బాలుర వసతి గృహం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలకులు అన్ని యూనివర్సిటీలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. గతంలో యూనివర్సిటీలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఇప్పటికైనా యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలని, వర్సిటీల అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపాలని కోరారు. నాయకులు రవీందర్, వంశీ, గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



నగరంలోని డీఆర్సీలో నిలిపిన చెత్త వాహనాలు



నిరసన తెలుపుతున్న మున్సిపల్ డ్రైవర్లు

నిజామాబాద్నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్లో చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లపై వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు డీఆర్సీ కార్యాలయం ఎదుట వాహనాలను నిలిపివేసి, ధర్నా నిర్వహించారు. అనంతరం పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ.. వాహనాల డ్రైవర్లకు పెట్రోల్ బంకులో సక్రమంగా డీజిల్ పోయకపోవడంతో చెత్త సేకరణ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. బంక్ యాజమాని భయపెడుతున్నాడన్నారు. డంపింగ్యార్డులో సక్రమంగా క్లీన్ చేయడం లేదన్నారు. వాహనాల చెడిపోతే మరమ్మతులు చేయించడానికి అధికారుల చుట్టు తిరుగుతున్నామన్నారు. డీఆర్సీలోనే మెకానిక్ షెడ్, పంక్చర్షాపు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. కార్మికులను వేధింపులకు గురిచేస్తే సహించబోమన్నారు. డ్రైవర్స్ భూపతి, ఏకావత్, లక్ష్మన్, నవీన్, సంతోష్గౌడ్, రవికిరన్, వినోద్ పాల్గొన్నారు.

ధర్నాకు సీపీఎం మద్దతు

ఖలీల్వాడి: నగరంలో మున్సిపల్డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాకు మున్సిపల్ యూనియన్ నాయకులు, సీపీఎం నాయకులు, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు సంఘీభావాన్ని ప్రకటించి, ఆందోళనలో పాల్గొన్నారు. నాయకులు భూపతి ఏకనాథ్, సంతోష్గౌడ్, కిరణ్, లక్ష్మణ్, మహేష్, కార్మికులు ఉన్నారు.



జాబ్ మేళాకు అపూర్వ స్పందన



జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

నిజామాబాద్అర్బన్: నగరంలోని సుభాష్ నగర్లో గల ఎస్సీ్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా (జాబ్ ఫెయిర్) కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. టాటా ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ అడ్డా, పేటీఎం, ఆక్సిస్ బ్యాంక్, ఫాక్స్కాన్, నిజామాబాద్ వరుణ్ మోటార్స్ సహా వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై, విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు మేళాకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ అంబోజి హరిప్రసాద్ తెలిపారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

శానిటరీ ఇన్స్పెక్టర్లను నియమించాలి

నిజామాబాద్నాగారం: నగర మున్సిపాలిటీలో పూర్తిస్థాయి శానిటరీ ఇన్స్పెక్టర్లను, హెల్త్ అసి స్టెంట్లను నియమించాలని మున్సిపల్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ శానిటేషన్ వర్కర్స్ డ్రైవ ర్స్, జవాన్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం నగరంలోని ము న్సిపల్ కమిషనర్ మంద మకరందుకు విన్నవించారు. హెల్త్ అసిస్టెంట్స్కు డిప్యూటేషన్ ద్వారా ఎస్సైలుగా నియమించారన్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించిన జవాన్లను తొలగించాలన్నారు. నియామకాల్లో అవకవతకలు జరుగుతున్నాయని దీనిపై విచారణ చే యాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్, నాయకులు ఉన్నారు.

వరికి రూ.500 బోనస్ అందించాలి

- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- డిచ్పల్లిలో బీఆర్ఎస్ ధర్నా



డిచ్పల్లిలో బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్పల్లి(నిజామాబాద్రూరల్): జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన వరి పంట మొత్తాన్ని లెక్కించి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ వెంటనే అందించాలని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు వరి పంటకు బోనస్ అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్నాలో బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని, మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వడ్లు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు మాట మార్చి సన్న వడ్లకే ఇస్తామనడం రైతులను మోసగించడమేనని విమర్శించారు. యాసంగిలో 90శాతం రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని తెలిపారు. సన్నరకం వడ్లను ముందుగానే రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కేవలం దొడ్డు వడ్లనే కొనుగోలు చేశారని తెలిపారు. దీంతో సన్నరకం వడ్ల వివరాలు దొరికే అవకాశం లేదని, దీంతో ప్రభుత్వం బోనస్ ఇవ్వకుండా ఉండేందుకే మాట మార్చిందని విమర్శించారు. సీఎం రేవంత్రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు తాము మోసపోయామని బాధపడుతున్నారన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం చెబుతూ రైతులను మరోసారి మోసగించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. అధికారంలో లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు చాలా అడ్డంకులు వస్తాయని, వాటిని లెక్కచేయకుండా ప్రజలకు అండగా ఉంటూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తాను నిజామాబాద్ ఎంపీగా గెలిస్తే ఇంకా బాగుంటుందన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల మధ్యలో ఉంటానన్నారు. అధికార కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడిని కాబట్టే తాను వాడిన రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే వాడటం లేదని ఆరోపించారు. వరికి బోనస్ ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ రమేష్నాయక్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మొచ్చె శ్రీనివాస్, మహిపాల్యాదవ్, మదుకర్రావు, చింతల గంగాదాస్, శ్రీనివాస్, నాయకులు కుంచాల రాజు, హన్మంత్రెడ్డి, చింత మహేష్, శక్కరికొండ కృష్ణ, పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, గీత, యూసుఫ్, సాయిలు, లింగం, రంజిత్, పాశంకుమార్, బుల్లెట్ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో కరెంట్ కోత

నిజామాబాద్నాగారం: నగరంలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా కరెంట్ కోత ఉండనున్నట్లు ఏడీఈ టౌన్ 1, 2, 3 చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశంలు ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ హౌస్, తిలక్ గార్డెన్, దుబ్బ, మిర్చి కాంపౌండ్, వినాయక నగర్, బోర్గం, దుబ్బ, న్యూ కలెక్టర్ ఆఫీస్, ముబారక్ నగర్, సుభాష్ నగర్, అర్సపల్లి, న్యూ హౌసింగ్ బోర్డు, గూపన్పల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,200	వెండి (కిలో)	87,500
22 క్యారెట్స్	67,525		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్సేల్	రిటైల్		హోల్సేల్	రిటైల్
టమాట	12	24	గాజరు గడ్డ	35	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	130	గోబి గడ్డ	25	50
కాకరకాయ	40	60	గోబి పువ్వు	30	50
వంకాయ	20	40	బీట్రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80			

– సుభాష్నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 అపరిచితుడు (తెలుగు) - 1.30, 7.30
- స్క్రీన్-2 ది గార్ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) - 10.45, 4.30, 7.30, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 1.40, మిరల్ (తెలుగు) - 10.30
- స్క్రీన్-3 అపరిచితుడు (తెలుగు) - 10.35, మిరల్ (తెలుగు) - 1.50, కింగ్డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 4.40, 10.30, బాక్ (తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 కృష్ణమ్మ (తెలుగు) - 1.20, 7.25, కింగ్డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లిష్) - 4.15, అపరిచితుడు - 10.20
- స్క్రీన్-2 ది గార్ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) - 12.00, 2.25, 4.50, 7.15, 9.40
- స్క్రీన్-3 కర్తం భుక్తం (హిందీ) - 1.10, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, 10.00
- స్క్రీన్-4 నటరత్నాలు (తెలుగు) - 12.10, దర్శిని (తెలుగు) - 2.50, మిరల్ (తెలుగు) - 5.30, 10.30, అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (తెలుగు) - 8.25

ప్రమాదకరంగా మూలమలుపులు



సిరికొండ సమీపంలో మూలమలుపు వద్ద ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు



మైలారం గ్రామ సమీపంలో..

- రహదారి వెంబడి ముళ్ల పొదలు
- సిరికొండ మండలంలో రోడ్ల దుస్థితి
- ఇబ్బందుల్లో వాహనదారులు

సిరికొండ: మండలంలోని ప్రధాన రహదారులపై ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడంతో మూలమలుపుల వద్ద వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సిరికొండ మండల కేంద్రం మీదుగా ప్రధాన రహదారులపై రాజన్న–సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ, కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల రాకపోకలు సాగుతుంటాయి. కానీ వేములవాడకు వెళ్లే రహదారితో పాటు, నిజామాబాద్, కామారెడ్డి, భీంగల్, ఆర్మూర్ పట్టణాలకు వెళ్లే రహదారుల వెంబడి తుమ్మ లాంటి ముళ్ల చెట్లతోపాటు వివిధ రకాల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. కొన్నిచోట్ల మూలమలుపుల వద్ద ముళ్ల పొదలు దట్టంగా పెరిగిపోవడంతో మూలమలుపులు ఏర్పడటం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనాలు ఒక పక్కనుంచి వెళుతుంటే ముళ్ల పొదలు తగలడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల వెంబడి విపరీతంగా పెరిగిపోయిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



సిరికొండ మండలంలో రోడ్ల వెంబడి ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి. ముళ్లపొదలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి. – గంగారెడ్డి, నారాయణపల్లె

త్వరలో తొలగిస్తాం..

మండలంలోని ప్రధాన రహదారుల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను త్వరలో తొలగిస్తాం. రోడ్ల వెంబడి ముళ్ల పొదలు బాగానే పెరిగిపోయాయి. వాటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించాం. అన్ని రోడ్ల వెంబడి ముళ్ల పొదలను తొలగించి, శుభ్రం చేయిస్తాం. – ప్రవీణ్కుమార్, ఆర్అండ్బీ ఏఈ

అందుబాటులో సోయా విత్తనాలు

రుద్రూర్: మండలంలోని ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రంలో సోయా చిక్కుడు– బాసర రకం విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి బాలాజీ నాయక్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బాసర రకం ఫౌండేషన్ 110 రోజుల కాల పరిమితి ఉంటుందన్నారు. రైతులు పరిశోధన స్థానంలో విత్తనాలు పొందాలన్నారు.